ఈ వారం
బహుమతి పొందిన కథ

# డ్యూటీ

రామకృష్ణ యాదవ్.




రాణి లక్ష్మీదేవమ్మ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పరంకాని రోజులవి. ప్రైవేటు యాజమాన్యంతో కుమ్మక్కై కళాశాలలో విద్యార్థుల కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడం, పేద విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్పులతోపాటు కళాశాల నిధులను స్వార్థం కోసం దుర్వినియోగపరచడం, లంచాలకు లోబడి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకిచ్చే సీట్లను తక్కువ మార్కులు పొందిన విద్యార్థుల కివ్వటం— ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలు.

చర్చలకై వెళ్ళిన విద్యార్థి నాయకులను నానా దుర్భాషలాడి క్రమశిక్షణ పేరుతో కళాశాల నుండి డిస్మిస్ చేయడంతో,

విద్యార్థి నాయకుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, బహిష్కృతులకు పునఃప్రవేశం కల్పించాలని విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు.

పరిస్థితి విషమించడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

నాయకుల అండదండలున్న ప్రిన్సిపాల్ బహిరంగ క్షమాపణకు ఒప్పుకొనలేదు. అతనికి విద్యార్థులకు మధ్య సయోధ్య కుదర్చాలన్న పోలీసుల ప్రయత్నం విఫలమైపోయింది.

ఆవేశంతో విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను ఛాంబర్‌లోంచి బయటకు రానివ్వలేదు. తప్పనిసరి పరిస్థితిలో పోలీసులు లాఠీ ప్రయోగం చేయక తప్పలేదు. స్వల్పంగా గాయపడిన విద్యార్థులు అవుట్ పేషెంట్లుగా చికిత్స చేయించుకున్నారు ఒక్క ప్రభు పరిస్థితే ఆందోళన కరంగా ఉంది. ఎమర్జన్సీ వార్డ్‌లో చేర్పించారు. రెచ్చిపోయిన విద్యార్థులు సంఘటనకు బాధ్యుడైన ఎస్సైని సస్పెండ్ చేయాలంటూ సమ్మెను ఉధృతం చేశారు.

జాలిగుండెగల ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించినందుకు ఎస్సైకి బదిలీ అవార్డు ప్రకటించింది.

పరిస్థితి సమీక్షించడానికి వచ్చిన ఎస్.పి ప్రభును పరామర్శించి వెళ్ళిపోయాడు. విద్యార్థులు ఎస్సైని లోపలికి వెళ్ళనీయకుండా హాస్పిటల్ గేట్ ముందు అడ్డగించి, చుట్టుముట్టారు. ఇష్టానుసారంగా బూతులు తిడుతూ చాటు నుండి చెప్పులు విసిరారు.

ఎవరో తుంటరి విసిరిన రాయి తలకు తగిలింది. స్రవించిన రక్తం ఖాకీ దుస్తులపై కొంత స్థలాన్ని ఆక్రమించింది.

అయినా సౌమ్యంగానే అడిగాడు ప్రభును చూడటానికి అనుమతి కోసం.

"వీల్లేదు" అంటూ అందరి నుండి వ్యతిరేకత ఎదురయ్యింది.

"జరిగిన సంఘటనకు నేను బాధపడుతున్నాను...వెళ్ళనివ్వండి... ప్లీజ్!"

"మీ సంజాయిషీలు మాకు అక్కర్లేదు.ఇక్కడి నుండి వెళ్ళకపోతే జరగబోయే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని హెచ్చరించారు.

"పోనీ... ఒక అధికారిగా అనుమతించకపోయినా... ఒక తండ్రి..?"అప్పటికే అతని కళ్ళు జలపూరితమయ్యాయి.

"నీలాంటి కసాయి వారికి మాలాంటి కొడుకులుంటేగా తెలిసేది. మా నాయకుణ్ణి చూసేందుకు అనుమతించం. అంతే!" ఖండితంగా చెప్పారు.

"ప్రభు మీకు నాయకుడు కావచ్చు... కానీ ...నాకు కన్నకొడుకు"

దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. వెనుతిరుగుతున్న అతణ్ణి ఎవరూ ఆపడానికి ప్రయత్నం చేయలేదు.

విసిరిన చెప్పుల్ని తిరిగి తెచ్చుకొనగలరేమో గానీ, నీచమైన తిట్లను వెనక్కు తీసుకోలేరు. కన్నకొడుకుపై లాఠీ ఝుళిపించిన అతని ఉన్నత వ్యక్తిత్వానికి ప్రజలందరూ చూస్తుండగానే కలిగించిన అగౌరవాన్ని పూడ్చలేరు. ●